క్లుప్తంగా

యశోద ఆస్పత్రికి మాజీ ఎమ్మెల్యే అరూరి

వర్ధన్నపేట: మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ సోమవారం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి వెళ్లారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఇటీవల తుంటి ఎముక మార్పిడి శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ సీఎం కేసీఆర్ వైద్యుల పర్యవేక్షణలో ఆస్పత్రిలో ఉండగా ఆయన ఆరోగ్య పరిస్థితిపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను అరూరి రమేష్ అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం



నర్సంపేట: స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హనుమకొండలోని నివాసంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు వేముల ఇంద్రదేవ్, ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి సందీప్, దుగ్గొండి మండల అధ్యక్షుడు నరిగే ప్రవీణ్, పట్టణ కమిటీ నాయకుడు పున్నం రాజు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై అభిమానంతో పాదయాత్ర




రాయపర్తి: రేవంత్‌రెడ్డిపై అభిమానంతో మండలంలోని జగన్నాథపల్లి గ్రామానికి చెందిన బద్దం వీరేందర్‌రెడ్డితోపాటు పలువురు యువకులు సోమవారం జనగామ జిల్లాలోని పాలకుర్తి మండలంలోని సోమేశ్వరస్వామి ఆలయానికి పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా వీరేందర్‌రెడ్డి, యువకులు మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సీఎం అయితే పాదయాత్ర చేస్తానని మొక్కుకున్నట్టు తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన నేపథ్యంలో మొక్కు చెల్లించేందుకు బయల్దేరినట్టు చెప్పారు. వారికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, నంగునూరి అశోక్, సరికొండ కృష్ణారెడ్డి, జినుగు రత్నాకర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దెల వెంకటేష్, కందుకూరి కృష్ణ, బద్దం పులీందర్‌రెడ్డి, సృజనారెడ్డి, బద్దం సుగుణమ్మ, పూసల మనోజ్‌కుమార్, గాడిపెల్లి యాకయ్య, సత్తూరి వీరభద్రం, మంగులాల్, పవన్, రవి, సాయి, ఉమ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకోవాలి



చెన్నారావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని అర్హులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వట్టి తిరుపతిరెడ్డి కోరారు. మండలంలోని ఉప్పరపల్లిలో ఆ పథకాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉచిత ప్రయాణంతో మహిళలకు ఇబ్బందులు తొలగనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో యువజన నాయకుడు బొమ్మెర సతీష్, ఉపసర్పంచ్ కాసాని రమేష్, నాయకులు అందె వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, మహేందర్‌రెడ్డి, పరికి మధు, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రామప్ప ఆలయంలో మొక్కుల చెల్లింపు



గీసుకొండ: పరకాల ఎమ్మెల్యేగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి గెలిచిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆకుల రుద్రప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి కూసం రమేశ్ రామప్ప ఆలయంలోని శివలింగం వద్ద సోమవారం మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యేగా రేవూరి పొందాలని కోరుతూ ఇటీవల తాము మొక్కుకున్నట్టు వారు తెలిపారు.

నేడు ఆయుర్వేద వైద్యశిబిరం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట కురుమ కులసంఘం భవనంలో ఆయుష్, ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కురుమ సంఘం మండల పరశురాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరానికి ఆయుర్వేద సీనియర్ వైద్యులు వస్తున్నారని, ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.



నల్లబెల్లి : నీటిలో దీపాలు వదులుతున్న భక్తులు



నర్సంపేట : పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వేడుకగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం


నర్సంపేట: కార్తీకమాసం చివరి సోమవారం మాస శివరాత్రి సందర్భంగా పట్టణంలోని కాశీ విశ్వేశ్వర రామాంజనేయస్వామి ఆలయంలోని శివాలయంలో అర్చకులు వేములపల్లి నిశాంత్‌శర్మ ఆధ్వర్యంలో సోమవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా పరిసరాల్లోని పల్లెల నుంచి సైతం మహిళలు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు.

కనుల పండువగా దీపోత్సవం

నల్లబెల్లి: కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాన్ని సోమవారం రాత్రి కనుల పండువగా జరుపుకున్నారు. ఆలయ ఆవరణలో తాత్కాలిక కోనేరు ఏర్పాటు చేసి దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత అర్చకుడు బ్రహ్మశ్రీ శ్రీనివాస్ శర్మ మంత్రోచ్చారణతో బిల్వ పత్రాలతో శివుడికి అర్చన, రుద్రభిషేకం చేశారు. మహిళలు, యువతులు అరటి భోగాల ముక్కలపై దీపాలును వెలిగించి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కోనేరులోని నీటిలోకి జారవిడిచారు. తమ కుటుంబాలను సల్లంగ చూడాలని భగవంతుడిని వేడుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరుడు

చెన్నారావుపేట: కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని శ్రీ సిద్ధేశ్వర ఆలయంలో అర్చకులు బీఎం.శాస్త్రీ, సాయి శాస్త్రీ, గణేష్ శాస్త్రీ సిద్దేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.



చెన్నారావుపేట: ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరుడు

ఘనంగా భాషా దివస్ వేడుకలు



చెన్నారావుపేట: వేడుకల్లో ఉపాధ్యాయులు



ఖానాపురం: నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఖానాపురం: మండలవ్యాప్తంగా భాషా దివాస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులు తెలుగు భాష గొప్పతనాన్ని చాటి చెప్పేలా నృత్యాలు, నాటికలను ప్రదర్శించారు. అనంతరం హెచ్ఎం విజయ మాట్లాడారు. విద్యార్థులందరూ మాతృభాషపై మక్కువ కలిగి ఉండాలని చెప్పారు. మాతృ భాషలో రాణిస్తే ఇతర భాషల్లోనూ రాణించడానికి అవకాశాలు మెండుగా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వజ్రం, సరిత, కరీంచంద్, నాయుడు, రామ్మోహన్‌రావు, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం హెచ్ఎం చిదురాల మాధవి మాట్లాడారు. భాషా సామరస్యం కోసం భారతీయ భాషలు నేర్చుకునేలా అనుకూలమైన వాతావరణాన్ని అన్ని విద్యాసంస్థలు డిసెంబర్ 11న కల్పిస్తూ భాషా దివస్ నిర్వహిస్తాయన్నారు. విద్యార్థులకు క్విజ్, ఉపన్యాసం, వ్యాసరచన, గేయాలు, నృత్యాలు, మహనీయుల వేషధారణ కార్యక్రమాలు నిర్వహించగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేముల మమత, మోహన్‌రావు, శశిధర్, బాలాజీరావు, సుందర్, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ అవినీతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నల్లబెల్లి: అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నాడంటూ మండలంలోని మామిండ్లవీరయ్యపల్లి సర్పంచ్ ఊరటి అమరేందర్‌పై జిల్లా కలెక్టర్‌కు ఉపసర్పంచ్ ఇంతల అనంతం, పలువురు వార్డు సభ్యులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్పంచ్ అమరేందర్ స్మశాన వాటిక నిర్మాణం కోసం నాగరాజుపల్లి శివారులో ఊరటి సుజాతకు చెందిన ఐదు గుంటల స్థలాన్ని కొనుగోలు చేసి గ్రామ పంచాయతీ పేరుతో మూడేళ్ల క్రితం రిజిస్టేషన్ చేయించాడని తెలిపారు. కొన్ని కారణాలతో స్మశాన వాటిక నిర్మాణాన్ని మరో చోట భూమి కొనుగోలు చేసి నిర్మించారు. గ్రామ పంచాయతీ పేరుతో ఉన్న భూమిని అధికారులతో కుమ్మకై సర్పంచ్ తన పేరుతో రిజిస్టేషన్ చేయించుకున్నాడని ఆరోపించారు. గ్రామ పంచాయతీకి మంజూరైన ట్రాక్టర్‌ను వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ ఆదాయాన్ని స్వాహా చేసినట్లు పేర్కొన్నారు. సర్పంచ్ అమరేందర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంగెం: మండలంలోని కుంటపల్లి సర్పంచ్ అక్రమాలకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఆ గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు నిమ్మనబోయిన అయిలయ్య జిల్లా కలెక్టర్ ప్రావిణ్యకు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. పాత పాఠశాల భవనాన్ని కూల్చివేసి సామగ్రిని సొంతానికి వాడుకున్నాడని, అతని ఇంటికి రెండు నల్లా కనెక్షన్లు తీసుకుని నీటిని వాడుకుంటూ గ్రామంలోని ఎనబోతుల వాడకు పైపు లైన్ వేయక పోవడం ఇప్పటికి నీరు రావడం లేదని, తదితర ఆరోపణలు చేశాడు. సర్పంచ్ అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్రమంగా పట్టా..

నల్లబెల్లి: మండలంలోని గోవిందాపూర్ గ్రామ శివారులోని శంషాబాద్ యాపలకుంట చెరువు శిఖం భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నాడంటూ పంతులుపల్లి గ్రామానికి చెందిన మామిండ్ల ఆదిరెడ్డిపై తహసీల్దార్ రాజేష్‌కు శంషాబాద్ గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. ఆదిరెడ్డి యాపలకుంట చెరువు శిఖంలో 3.26 ఎకరాల భూమిని అక్రమంగా కబ్జా చేసి అధికారులతో కుమ్మకై పట్టా చేసుకున్నాడని ఆరోపించారు. విచారణ చేసి అక్రమ పట్టాను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గ్రామస్తులు సింగనబోయిన లాలయ్య, బైరి రాజబోసు, భిక్షపతి, రవి, రాములు, సింగనబోయిన సురేష్ పాల్గొన్నారు.

అవగాహనతోనే హక్కుల పరిరక్షణ



సదస్సులో మాట్లాడుతున్న బెజ్జంకి ప్రభాకర్



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రభాకర్, విద్యార్థులు

నర్సంపేట: అవగాహన పెంచుకోవడం ద్వారానే హక్కులను పరిరక్షించుకోగలమని స్వయంకృషి సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ తెలిపారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్వయంకృషి సోషల్ వర్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సహకారంతో బాలబాలికలకు సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజలందరూ మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తద్వారా హక్కుల ఉల్లంఘన జరగకుండా చూసుకోవచ్చని చెప్పారు. హక్కుల పరిరక్షణకు పాటు పడాలని తెలిపారు. స్వేచ్ఛా, భావ ప్రకటనా స్వేచ్ఛ, జీవించే, స్వాతంత్ర్యపు హక్కులను ప్రధాన మానవ హక్కులుగా అభివర్ణించారు. మానవ హక్కుల పరిరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు.

బాలల అక్రమ రవాణా సామాజిక నేరం

మానవ, బాలల అక్రమ రవాణాను సామాజిక నేరంగా ఎఫ్ఎంఎం సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ బెజ్జంకి ప్రభాకర్ అభివర్ణించారు. పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో 'మానవ, బాలల అక్రమ రవాణా–నిర్మూలన'పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికలు, మహిళలే ప్రధానంగా అక్రమ రవాణా బారిన పడుతున్నారని చెప్పారు. అపరిచితుల మాయమాటల్లో పడవద్దని, ప్రలోభాలకు గురికావొద్దని విద్యార్థినులకు సూచించారు. అనుమానితుల సమాచారాన్ని చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ 100 టోల్ ఫ్రీ నంబర్లకు అందించాలని చెప్పారు. అనంతరం విద్యార్థినులతో కలిసి అక్రమ రవాణా కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో హెచ్ఎం కాంతారావు, ఉపాధ్యాయ సిబ్బంది రవి, రాజేష్, వాణి, నిర్మల, స్వరూప, విజయలక్ష్మి, షౌరి, పీడీ స్వామి పాల్గొన్నారు.

సకాలంలో టీకాలు వేయండి



దుగ్గొండి: సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటరమణ వైద్యులను, సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్‌సీ) సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం వైద్యుడు, సిబ్బందితో మాట్లాడారు. ప్రతి బుధ, శనివారాల్లో గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయాల చెప్పారు. టీకా వేయించుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిరణ్‌రాజు, హెచ్ఈఓ సాంబయ్య, చాణక్య, రహమాన్, స్టాఫ్‌నర్సు సబిత పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ



నల్లబెల్లి: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపుల్లో వ్యవసాయ శాఖ జిల్లా ఏడీఏ (టెక్నికల్) విజయ్ చంద్ర సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులను పరిశీలించారు. ఇప్పటి వరకు విక్రయించిన సరుకుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెస్టిసైడ్ లైసెన్స్‌ల్లో పూర్తి స్థాయిలో పీసీలు నమోదు చేసుకోని శ్రీనివాస, హైమద్, వెంకటేశ్వర, కర్ర మల్లారెడ్డి ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపుల యజమానులకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని, ఈ–పాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలని, బయో మందుల విక్రేతలు జీ–2 ఫారం, పర్మిషన్ లెటర్ ఉంచుకోవాలని షాపుల నిర్వాహకులకు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఏఓ పరమేశ్వర్ ఉన్నారు.

'ఉపాధి' పనులను వినియోగించుకోవాలి



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కళావతి



అంగన్‌వాడీలో ఆహారాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

సంగెం: ఉపాధి హామీ పనులను వినియోగించుకోవాలని కూలీలకు ఎంపీపీ కళావతి సూచించారు. మండల కేంద్రంలోని నక్కల తూము నుంచి మాదారపు భాస్కర్ భూమి వరకు రూ.8 లక్షల వ్యయంతో చేపట్టిన రోడ్డు ఫార్మేషన్ పనులను సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉపాధి హామీ నిబంధనల ప్రకారం పని చేస్తే రోజుకు రూ.272 కూలీ వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గుండేటి బాబు, ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య, నాయకులు మెట్టుపల్లి ఏలియా, జేఈ గణేష్, ఇన్‌ఛార్జ్ ఏపీఓ రమేష్, ఎఫ్ఏ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో..

మండలంలోని కుంటపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీపీ కళావతి సోమవారం తనిఖీ చేశారు. చిన్నారులకు బాలామృతం, గుడ్లు, ఇతర పౌష్టికాహారం అమలుపై అంగన్‌వాడీ టీచర్లు సుజాత, విజయలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కావటి వెంకటయ్య, ఉపసర్పంచ్ జక్క దూడయ్య, పంచాయతీ కార్యదర్శి వాజీద్, వార్డు సభ్యులు చిర్ర సాంబరాజు, మాడిశెట్టి భాగ్యలక్ష్మి, బోనాల ప్రియాంక, గోవర్ధన్ పాల్గొన్నారు.

'మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు'



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి

చెన్నారావుపేట: నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఏడీఏ శ్రీనివాసరావుపై ఆరోపణలు చేయడం సరికాదని ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ బుర్రి తిరుపతి తెలిపారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో సీఎం కేసీఆర్‌ను ఒప్పించి వ్యవసాయ యాంత్రీకరణ పైలెట్ ప్రాజెక్ట్‌ను 50 శాతం సబ్సిడీతో రూ.75 కోట్ల మేరకు నిధులను మాజీ ఎమ్మెల్యే తీసుకొచ్చారని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకుని గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు బల్నె వెంకన్న, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు రఫీ, సొసైటీ చైర్మన్ మురహరి రవి, నాయకులు గఫార్, మల్లయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధి యువత ద్వారానే సాధ్యమని, అందుకు వారికి కావాల్సిన శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని కోరారు. అప్పుడే వారి కుటుంబాలు ఆర్థికంగా ఎదిగి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతి గ్రామంలో 10 మంది యువకులను ఎంపిక చేసి మండలానికి 100 మంది యువకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉద్యోగ రంగాల్లో రాణించేలా పోలీసు శాఖ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. మెరుగైన ప్రణాళిక తయారు కోసం ఈ నెల 21వ తేదీన జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్, శాయంపేట సీఐలు వెంకటరత్నం, మల్లేశం, ఎస్సైలతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి కృషి చేయండి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్‌తో పాటు అధ్యాపకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేతో మాట్లాడారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరైనందున త్వరగా పనులు చేపట్టేందుకు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కళాశాల అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ రాజయ్య, అశోక్‌మోరె, ఓదేలు, రవికుమార్, డాక్టర్ అనిల్‌కుమార్, దుప్పటి సంజయ్ ఉన్నారు.

ఏకశిల చిల్డ్రన్స్ పార్కును సందర్శించిన విద్యార్థులు

ఖిలా వరంగల్: 'బేటీ బచావో.. బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఏకశిల చిల్డ్రన్స్ పార్కును వరంగల్ జిల్లా సంక్షేమాధికారి శారద ఆధ్వర్యంలో వర్ధన్నపేట, రాయపర్తి మండలాలకు చెందిన కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ)విద్యార్థులు సోమవారం సందర్శించారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. నాలుగు కీర్తి తోరణాల మధ్య నల్ల రాతిలో చెక్కిన శిల్పాలు, అద్భుత శిల్పకళా సంపద, రాతి, మట్టికోటలు, ఖుష్ మహల్‌ను ఆసక్తిగా తిలకించారు. పలు అంశాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్, డీహెచ్ఈడబ్ల్యూ టీం, సఖి అడ్మిన్ శ్రీలత, సూపర్‌వైజర్ పద్మలత, యూడీసీ కుమార్, డీసీపీఓ రాజు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు తప్పని ఈ–కేవైసీ కష్టాలు

- గంటల తరబడి క్యూలో మహిళలు..



గ్యాస్ ఏజెన్సీ వద్ద గుమిగూడిన మహిళలు

నర్సంపేట రూరల్ : ప్రజలకు ఈ–కేవైసీ తిప్పలు తప్పడం లేదు. గ్యాస్ ఏజెన్సీల వద్ద మహిళలు గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చోవాల్సిన దుస్థితి నెలకొంది. సర్వర్ డౌన్, ఆధార్ లింక్‌తో ఉన్న వృద్ధుల వేలిముద్రలు రాక మహిళలు ఆపసోపాలు పడుతున్నారు. గ్యాస్ కేవైసీకి ఇంకా గడువు ఉన్నప్పటికీ వందలాదిగా వస్తుండడంతో గ్యాస్ ఏజెన్సీల ముందు భారీ క్యూలైన్ ఏర్పడుతోంది.

నర్సంపేట డివిజన్‌లోని పలు మండలాలకు చెందిన గ్రామాలతోపాటు కొత్తగూడ మండలంలోని పలు గ్యాస్ కనెక్షన్లలో అత్యధికంగా నర్సంపేట పట్టణంలోని సర్వాపురంలోని భారత్ గ్యాస్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో పలు గ్రామాల నుంచి మహిళలు ప్రత్యేక ఆటోలు, ఇతర వాహనాల్లో వస్తున్నారు. ఇంకా సమయం ఉన్నప్పటికి గ్రామాల్లో రూ.500కే గ్యాస్ సిలిండర్లు కావాలంటే తర్వగా కేవైసీ చేయించాలన్న తప్పుడు ప్రచారాలు జోరందుకోవడంతో వారం రోజులుగా భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్దకు వందలాది మంది వస్తున్నారు. ఈ క్రమంలోనే సర్వర్ పని చేయక, వేలిముద్రలు రాక నిరీక్షణ తప్పడం లేదు. ఈ విషయమై గ్యాస్ ఏజెన్సీ బాధ్యుడు శ్రీధర్‌ను 'సాక్షి' మాట్లాడగా కేవైసీ చేయించుకోవడానికి ఇంకా సమయం ఉందన్నారు. ప్రజలంతా ఒక్కసారిగా రావడంతో క్యూలైన్ పెరుగుతోందని చెప్పారు. ఎప్పటికప్పుడు ఈ–కేవైసీ చేసి పంపిస్తున్నట్టు తెలిపారు.

ఈ–కేవైసీ తప్పనిసరి

ఆత్మకూరు : గ్యాస్ వినియోగదారులు ఈ–కేవైసీ చేసుకోవాలని హెచ్‌పీ గ్యాస్ సంస్థ డిస్ట్రిబ్యూటర్ విజయ్‌కుమార్, మేనేజర్ ప్రవీణ్ ప్రకటనలో కోరారు. మృతుల పేరుతో గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు కేంద్రం గుర్తించిన క్రమంలో వాటిని సవరించే ఉద్దేశ్యంతో ఈ–కేవైసీ చేపట్టినట్లు తెలిపారు. వినియోదారుల ఆధార్ కార్డుతో అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే రాయితీకి ఈ–కేవైసీకి సంబంధం లేదని ప్రవీణ్ స్పష్టం చేశారు. ఈ–కేవైసీకి గడువు ప్రకటించలేదని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



ఆత్మకూరు : తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం మహిళా ప్రచార కార్యదర్శి ఓదెల హైమావతి కాంగ్రెస్ సోమవారం పార్టీలో చేరారు. ఆత్మకూరు జెడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడారు. ఆచార్య జయశంకర్ సేవలని జాతి ఎప్పటికీ మరువదన్నారు. అక్కంపేట గ్రామాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ గ్రామంగా ప్రకటించిందని, దీంతో గ్రామస్తులు చిరకాల కోరిక నెరవేరిందన్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా చేసినందుకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన కాదరి శంకర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి సర్పంచ్ జనగాం మంజుల సత్యనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా క్వింటాల్ బియ్యాన్ని అందించారు. ఆయన వెంట ఉపసర్పంచ్ కటకం రాజ్‌కుమార్, నాయకులు మోత్కూరు రాజ్‌కుమార్, మంద రాజన్న, పల్లె కృష్ణయ్య, ఆకుతోట సతీష్, కటకం జనార్దన్, సోముల రవి, గాజర్ల సదయ్య, చలమల శివారెడ్డి, పల్లె కోటి, ఎర్ర రమేష్, మడికొండ కుమార్, దామర చిరంజీవి, ఒంటరి బాబు, కొయ్యడ సతీష్, శీను, రాజు, కమలమ్మ, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.